కథ

ప్రఫుల్ల చంద్ర

# బానిస యజమానిగా మారిన వేళ

గణిత లెక్చరర్ మోహనమూర్తి (మోమూ)కి తన సమర్థతమీద ప్రగాఢ విశ్వాసం. ప్రభుత్వం ఇచ్చే పన్నెండు వేల జీతం తన ప్రతిభకు తగినది కాదని అతని నమ్మకం. ట్యూషన్ల ద్వారా మరో పదివేలు సంపాదిస్తున్నా అతనికి తృప్తి లేదు.

కాలికి చెప్పులు లేకుండా, ఒంటి నిండా బట్టలు, కడుపునిండా తిండి లేని దుర్భర దరిద్రంలో తను చదువుకున్న రోజులు అతనికి గుర్తున్నాయి. అమ్మలాగ ఆలి, తనలాగా బిడ్డలు కష్టపడకూడదని మోమూ ఆదర్శం. ప్రస్తుతం తన సంపాదన ఫర్వాలేదు. స్కూటర్ వుంది. అద్దె ఇల్లు విశాలంగా బాగుంది. పల్లెలోని అమ్మకు, తమ్ముళ్లకు సాయం చేయగలుగుతున్నాడు. కానీ ఇది చాలదు. ఇంకా ఎదగాలి. ఇంకా సంపాదించాలి. బిడ్డలకు మంచి చదువు ఇవ్వాలంటే ముందు ముందు లక్షల్లో ఖర్చు.

పట్నంలో కొత్తగా ప్రారంభించిన భాను కాలేజి యజమాని రెడ్డి టీచింగ్, ఎంసెట్ కోచింగ్‌లకు సంవత్సరానికి మూడు లక్షలతో బాటు కష్టానికి తగిన ప్రతిఫలం ఇస్తానని మోమూకి గేలం వేశాడు. తగిన ప్రతిఫలం లభిస్తే ఎంతైనా కష్టపడడానికి మోమూ సిద్ధమే. దాంతో ప్రభుత్వ కాలేజి వదిలేసి భానులో చేరాడు మోమూ.

పదేళ్లలో భాను బ్రహ్మాండంగా ఎదిగి శాఖోపశాఖలుగా విస్తరించింది. భాను ఫార్మసీ కాలేజి, భాను ఇంజనీరింగ్ కాలేజి ఏర్పడ్డాయి. భానుతో బాటు మోమూ కూడా ఎదిగాడు. టీచింగ్, కోచింగ్‌తోబాటు పర్యవేక్షణ, క్రమశిక్షణ అతని బాధ్యతలయాయి. జీతం సంవత్సరానికి తెలుపులో మూడు, నలుపులో ఐదు లక్షలు!

పట్నంలో తనకోసం ఒక భవంతి, పల్లెలో అమ్మకోసం మేడ కట్టించాడు. తమ్ముళ్లకు ఉపాధి కల్పించాడు. తనకొక కారు, ఫార్మసీ చదువుతున్న కొడుకు అభికి ఖరీదైన బైక్, ఇంటర్ చదువుతున్న కూతురికి స్కూటర్ వున్నాయి. పిల్లలిద్దరికీ అన్ని సదుపాయాలతో ప్రత్యేక గదులు, అందరికీ ఖరీదైన సెల్‌ఫోనులున్నాయి. అభికి కంప్యూటర్, కూతురికి డిజిటల్ కెమేరా, భార్యకు హ్యాండీకామ్ ప్రతి గదిలో టీవీలున్నాయి.

అతని ఎదుగుదల చూసి భుజం తట్టి అభినందించారందరూ. అయితే ఇది చాలదు. అమ్మాయికీ, అబ్బాయికీ చెరొక కారు కొని, చెరొక భవంతి నిర్మించాలి. ఎంత ఖర్చైనా సరే వాళ్ళకి గొప్ప ఉద్యోగాలిప్పించి ఘనమైన సంబంధాలు చూసి వైభవంగా పెళ్లి చేయాలి. సమర్థత, ఓపిక గల లెక్చరర్ ఎంత సాధించగలడో చేసి చూపించాలి- అని అనుక్షణం సగర్వంగా అనుకుంటూ ఉంటాడు మోమూ.

అన్నీ ఉన్నా అతనికి లేనిదొక్కటే.... తీరిక!

కాలేజీలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. క్రమశిక్షణ సమస్యలు పెరిగాయి. హాస్టల్ విద్యార్థుల పోట్లాటలు పెరిగాయి. అవన్నీ తీర్చవలసిన బాధ్యత కాక మెమూకి టీచింగ్, కోచింగ్ ఉండనే ఉన్నాయి. పైగా ఇతర పట్నాలలో కాలేజీలు నడు



స్తున్న తీరు పరిశీలించడానికి స్టడీ టూర్‌లు ఎక్కువయ్యాయి.

ఉదయం ఏడు గంటలకే కాలేజీకి వెళ్లే మోమూ రాత్రి పది దాటినా ఇంటికి రాలేకపోతున్నాడు. అతడు బిడ్డలతో మాట్లాడి నెలలూ, భార్యతో మాట్లాడి వారాలూ గడిచిపోతూ ఉంటాయి. రాత్రి పది వరకూ ప్రియంవద అతని కోసం వేచి ఉంటుంది. అప్పటికీ అతను రాకపోతే భోజనం చేసి పడుకుంటుంది. ఏదో సమయంలో అతడు ఇంట ప్రవేశించి భోజనం చేసి బెడ్ రూంలో చేరుతాడు. మంచం ఎక్కగానే నిద్ర! అయితే నిద్రపట్టని రాత్రుల్లోనే అతడు భార్యాబిడ్డల గురించి ఆలోచిస్తాడు. తన భార్య ప్రియ సహనశీల. బిడ్డల్ని, ఇంటిని సంబాళించుకోగల దక్షత ఆమెకుంది. ఆ సంతృప్తితోనే అతడు నిద్రలోకి జారిపోతాడు.

★ ★ ★

భాను కాలేజీ అనే కాదు చాలా కార్పొరేట్ కాలేజీల్లో ఆట పాటలుండవు. సెలవులుండవు. స్వాతంత్ర్య దినం, రిపబ్లిక్ డే లాంటి జాతీయ ఉత్సవాలుండవు. ఎంతసేపూ చదువు, పరీక్షలు, ర్యాంకుల గోల తప్ప సామాజిక స్పృహ, వ్యక్తిత్వ వికాసం లాంటి విషయాలపై శ్రద్ధ ఉండదు. రాజ్యాంగం అంటే ఏమిటో; రిపబ్లిక్ డే ఎందుకో తెలియని మేధావి ర్యాంకర్లు ఇలాంటి కాలేజీల్లో కనిపించడం సర్వసాధారణం.

అయితే భాను కాలేజీలో ఒక ఉత్సవం మాత్రం ఘనంగా జరుగుతుంది. అదే ఉపాధ్యాయ దినోత్సవం! రాష్ట్రంలో పేరెన్నికగన్న అధ్యాపకునికి ఆరోజు ఘనంగా సన్మానం చేయడమే కాక ఉపాధ్యాయులకు, పురప్రముఖులకు పాతిక రకాల వెజ్, నాన్ వెజ్ వంటకాలతో బ్రహ్మాండంగా డిన్నర్ ఇవ్వడం భాను యజమాని రెడ్డి ప్రత్యేకత.

ఎన్నో సంవత్సరాలు బ్రతిమాలినా ఒప్పుకోని ప్రఖ్యాత గణిత అధ్యాపకుడు సోమయ్యగారు ఈ సంవత్సరం సన్మానానికి ఒప్పుకున్నారు. నిజానికి మోమూ ఇంటర్ చదివే రోజుల్లో ఆయనకు ప్రియశిష్యుడు. తిండికి లేక, ఫీజులు కట్టలేక మోమూ అవస్థలు పడే ఆరోజుల్లో కన్నతండ్రిలాగ ఆయన ఆదుకున్నారు. మోమూ లెక్చరర్ అయాక ప్రతి సంవత్సరం గురువుగారిని కలవడం, ఆయన ఆప్యాయంగా ఆతిథ్యం ఇవ్వడం రివాజు అయింది.

కాలక్రమంలో సోమయ్యగారు కూడా ఉద్యోగం వదులుకొని హైదరాబాద్‌లో ఐఐటీ శిక్షణ కేంద్రం ప్రారంభించి మెరికల్లాంటి తన పూర్వ విద్యార్థుల్నే లెక్చరర్లుగా నియమించారు. ఇంటర్‌లో మార్కులను బట్టికాక తను పెట్టిన పరీక్షల్లో నిగ్గుతేలిన వందమందిని ప్రతి ఏటా ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. ఎవరెన్ని రికమెండేషన్లు తెచ్చినా వందకు మించి ఒక్కరిని కూడా అదనంగా చేర్చుకునే వారు కాదు. లెక్చరర్లు ఆరు గంటలు మించి పనిచేయనక్కరలేదు. తను పది గంటలు మించి పనిచేసేవారు కాదు.

అనతికాలంలోనే సోమయ్యగారి ఐఐటీ శిక్షణ కేంద్రం అఖండ ఖ్యాతి నార్జించింది. అక్కడ శిక్షణ పొందితే చాలు ఐఐటీలో సీటు గ్యారంటీ అని ప్రజలకు నమ్మకం ఏర్పడింది.

సన్మానాలంటే ఇష్టం లేని గురువుగారిని 'భాను'లో సత్కరించాలని ఐదేళ్ల నుంచి ప్రయత్నిస్తూ చివరకు ఆయన్ని ఒప్పించగలిగాడు మోమూ. పట్టుబట్టి మోమూ ఆయన్ని ఒప్పించడానికి గురుభక్తి ఒక్కటే కారణం కాదు. తను సాధించిన ఆస్తిపాస్తులు చూసి ఆయన మెచ్చుకోవాలన్నదీ ఒక కారణమే. నిజానికి ఆయన సంసారం కంటే తనదే ఎక్కువ!

ఉపాధ్యాయ దినోత్సవం నాడు తనే స్వయంగా రైల్వేస్టేషన్ కెళ్లి గురువుగార్ని ఇంటికి తీసుకొచ్చి భార్యాబిడ్డల్ని పరిచయం చేశాడు. ఆయన కాసేపు విశ్రాంతి తీసుకున్నాక కాలేజీకి తీసుకెళ్లాడు.

పొందూరు ఖద్దరు పంచె, లాల్చీ ధరించి భుజం మీద కండువా, నుదుట బొట్టుతో - ఉపాధ్యాయుడంటే ఇలా ఉండాలి అనిపించేట్టు ఆయన ఇచ్చిన ఉపన్యాసం సభికుల్ని ఉర్రూతలూగించింది. తర్వాత ఘన సన్మానం ఆ తర్వాత భారీ డిన్నర్ అయాక ఆయన్ని ఇంటికి తీసుకొచ్చాడు మోమూ.

అతని భార్యాబిడ్డలతో సోమయ్యగారు కాసేపు కబుర్లు చెప్పాక - ఫ్రెండ్ ఇంట్లో చదువుకుంటానని చెప్పి అభి వెళ్లిపోయాడు. అబ్బాయి గదిని మాష్టారికి కేటాయించాడు మోమూ.

★ ★ ★

## హాట్ హాట్ అనుష్క


**అందాల్ని తెరపై విందు చేసే తారల ప్రస్తావన వచ్చినప్పుడు అనుష్కని గుర్తుచేసుకోకుండా వుండలేరెవరు. తన తొలిచిత్రం 'సూపర్' దగ్గర్నుంచీ నిన్నటి 'లక్ష్యం' వరకూ ఆమె అందాల్ని ప్రేక్షకులు కళ్లారా వీక్షించారు. రాబోయే 'బలాదూర్' సినిమాలో అయితే అనుష్క మరింత రొమాంటిక్ లుక్స్‌తో దర్శనమివ్వబోతోంది అని టాలీవుడ్ జనాల ఉవాచ. ఈ సినిమాలో కాస్తంత సన్నబడి, సరికొత్త నాజూకు అందాలతో కుర్ర ప్రేక్షకుల్ని ఓ ఊపు ఊపబోతోందిట.**



తెల్లవారేక టిఫిన్ చేస్తూ ''నా వల్ల అభికి ఇబ్బంది కలిగినట్లుంది. ఫ్రెండ్ ఇంటికి వెళ్లిన వాడు ఇంకా రాలేదు'' అన్నారు సోమయ్య.

''అబ్బే, అదేం లేదు. అభి, సందీప్ అన్నదమ్ముల్లాగ మెలగుతారు. వీడు వాళ్లింటికెళ్లి ఒక్కోసారి టిఫిన్, భోజనం కూడా అక్కడే లాగించేస్తూ ఉంటాడు. వాడిక్కడకు వచ్చినా అంతే'' సగర్వంగా చెప్పింది ప్రియ.

టిఫిన్ చేస్తూ గురువుగారి నిన్నటి ఉపన్యాసాన్ని పొగుడుతూనే ఉన్నాడు మోమూ.




''సన్మానించే వారికి వ్యతిరేకంగా మాట్లాడలేని పరిస్థితి నాది. అందుకే సన్మానాలకు ఒప్పుకోను. కానీ నీ బలవంతం వల్ల...'' అన్నారు సోమయ్య.

ఆ రోజు సెలవు పెట్టి తీరికగా ఉన్నాడు మోమూ. సహజంగానే కార్పొరేట్ కాలేజీలూ, విద్యావిధానం మీదకు మళ్లింది వారి చర్చ.

నేటి విధానంలో విద్యార్థి సామాజిక స్పృహ, ఆదర్శాలు, లోకజ్ఞానం లేని పుస్తక బానిసలుగా తయారవుతున్నారు. వీరి చేతుల్లో దేశ భవిష్యత్తు, సమాజ శ్రేయం భద్రంగా ఉంటాయని చెప్పలేం. ఇప్పటికే మానవీయ విలువలు నశించిపోతున్నాయి అని చెప్పి, ''నువ్వు హాయిగా ఉన్నావా, మోహనా?'' అని అడిగాడు సోమయ్య.

ప్రశ్న హఠాత్తుగా రావడంతో ఉలిక్కిపడి ''ఓ! బ్రహ్మాండంగా ఉన్నా'' అన్నాడు మోమూ. కానీ ప్రియ తలవంచుకుంది. ఆమె ముఖం విషణ్ణంగా ఉంది. తీరని అసంతృప్తి ఆమెను నెమ్మది నెమ్మదిగా దహించి వేస్తున్నదని తెలుస్తూనే ఉంది.


''బహుశా హాయి అంటే నీ నిర్వచనం వేరు కాబోలు'' అని నవ్వేసి ''నేనిప్పటికీ భార్యాబిడ్డలతో కబుర్లు చెబుతాను. రోజూ మనవలతో ఆడుకుంటాను. వారి బాగోగులు పర్యవేక్షిస్తాను. వారానికొకసారి సంగీత కచేరీలకో, హరికథలకో సినిమాకో భార్యతో వెళతాను. నెలకొకసారి బంధువులను కలిసి యోగక్షేమాలు విచారిస్తాను. నీ టైమ్‌టేబుల్‌లో ఇలాంటివేవీ ఉండవని నాకు తెలుసు!'' గల గలా నవ్వేశారాయన.

మోమూ గంభీరంగా మారిపోయాడు. ప్రియ టీ చేసి తెచ్చింది.

టీ తాగుతూ ''సుఖ జీవనానికి డబ్బు అవసరమే కాని డబ్బు వెంట పరుగులు తీస్తూ సుఖం నుంచి దూరంగా పారిపోకూడదు మోహనా! డబ్బుతో కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలి. బిడ్డల భవిష్యత్తు చక్కబడాలి. కానీ బానిసలాగా పడివుండి సేవలు చేయవలసిన డబ్బు ఈరోజుల్లో యజమానిగా మారి చెలరేగిపోతూ మనుషుల్ని బానిసలుగా మార్చేస్తూ కుటుంబాన్ని

## ఈ మాటలకర్థం ఏమిటో?

**రియాసేన్ సోదరి రైమా సేన్ తెలుగులో 'ధైర్యం' సినిమా ఒక్కటి చేసింది. హిందీలో పరిణీత, ఏకలవ్య సినిమాల్లో సెకండ్ హీరోయిన్ టైప్ వేషాలు వేసిన ఆమె ఇకపై అలాంటి పాత్రలు ఒప్పుకోనంటోంది. బెంగాలీ సినిమాల్లో సోలో హీరోయిన్‌గా ఎన్నో సినిమాలు చేస్తున్న నేను సెకండ్ హీరోయిన్ వేషాలు వేయడం ఏం బాగోదు కదా! అలాగని మల్టీ స్టారర్ లాంటి భారీ సినిమాల్లో ప్రాధాన్యత గల హీరోయిన్ పాత్రలొస్తే మాత్రం నటిస్తాను- అంటోంది రైమా. నటించను అంటూనే నటిస్తుంది అన్నమాట.**



విచ్ఛిన్నం చేస్తోంది. ఎంత విషాదం!'' అన్నారు సోమయ్య గంభీరంగా.

టీ అయ్యాక ఆయన సంచి సర్దుకొని వెళ్లడానికి సిద్ధపడుతూ-

''మోహనా! డబ్బు వెంట తీరిక లేని నీ పరుగు చూసి బాధగా ఉందోయ్! యజమానిగా మారిన బానిస నిన్ను ఆడిస్తోందనిపిస్తోంది. మీ అబ్బాయి చెడిపోతున్న విషయం కూడా నీవు గమనించలేకపోతున్నావ్'' అన్నారు గంభీరంగా.

''అభి చెడిపోవడమా! నో ఛాన్స్! వాడు నా బిడ్డ! అయినా మీకెందుకలా అనిపించింది?'' దిగ్భ్రాంతిగా అడిగాడు మోమూ.

''చదివే పుస్తకాలు, చేసే స్నేహాలు మాదిరిగానే తను ఉండే గదిని బట్టి కూడా ఒక విద్యార్థి వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చు. అభి గదిలో కొన్ని గంటలు గడిపిన అనుభవంతో చెబుతున్నా. కాస్త అబ్బాయి సంగతి పట్టించుకో మోహనా! లేకుంటే నీ సంపాదనంతా వేస్ట్!'' అనేశారాయన.

ఆ తర్వాత ఇద్దరూ మాటలు మరిచిపోయారు. ఆయన్ని స్టేషన్‌లో దించి మోమూ ఇంటికొచ్చేసరికి ప్రియ గంభీరంగా అలా కూర్చునే ఉంది.

''గురువుగారికి వయసుతో బాటు చాదస్తమూ ఎక్కువైంది. మనబ్బాయి గురించి మనకంటే ఆయన కెక్కువ తెలుసా? పెద్దాయన ఏదో అనేశారు, పట్టించుకోకు!'' పక్కన కూర్చుని భార్యని ఓదార్చాడు మోమూ.

''లేదండీ! అబ్బాయి మీద నాకూ అనుమానంగానే ఉంది. సందీప్, వీడూ కలిసి అబద్ధాలు చెబుతున్నారు. చదువునెపంతో వీడు అక్కడికి వెళ్లడం, ఇద్దరూ కలిసి పబ్‌లకు చెక్కేయడం, తాగడం, డాన్స్‌లూ... మందలిస్తే అభి నన్ను ఖాతరు చేయడం లేదు. ఎప్పటికప్పుడు మీకు చెప్పాలనుకున్నా. మీకు తీరికే లేదాయె!'' ఆమె స్వరంలో నిష్ఠూరం, నిస్పృహ యత... కంట కన్నీరు!

కొడుకు గురించి కొత్త నిజం విని విస్తుపోయిన మోమూ అంతలోనే సర్దుకొని ''అప్పుడప్పుడు సరదాగా పబ్‌కి వెళ్లి తాగడం నేటి యువతరం ఫ్యాషన్. అంత మాత్రానికే వాడు చెడిపోయినట్లు కాదు!'' భార్యని ఓదార్చాడు కాని అతని స్వరంలో విశ్వసనీయత లోపించింది.

తీరిక లేక కొన్ని వారాలుగా మాట్లాడుకోలేకపోయిన వాళ్లిద్దరూ ఇప్పుడు తీరిక చిక్కినా మాటలు మరిచిపోయి ఆలోచనల్లో కూరుకుపోయారు.

మోమూ ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నప్పుడే జీవితం హాయిగా ఉండేది. వారం వారం సినిమా, నెలకొక పిక్నిక్, బంధుమిత్రుల ఇళ్లకు రాకపోకలు, పండుగలూ, పబ్బాలూ.. ఆనందాలూ...

కానీ ఇప్పుడేముంది?

అతనికి భార్యాబిడ్డలతో కాలక్షేపం చేసే తీరికే లేదు. సినిమాలు లేవు. షికార్లు లేవు. జోకులూ, నవ్వులూ, సరదాలు లేనే లేవు. ఇదీ ఒక జీవితమేనా? డబ్బుకోసం జీవితంలో తను ఎన్ని కోల్పోయాడో ప్రవాహ ఉరవడిలో కొట్టుకుపోతూ తను గమనించనే లేదు.

గురువుగారు బాగా ఆర్జించినా ఆయన రాబడి తనకంటే తక్కువే. అయితేనేం! ఆయన డబ్బుని అదుపులో పెట్టి కుటుంబం కోసం సమయాన్ని కేటాయించుకున్నారు. ఆనందాలూ, కుటుంబ బాధ్యతలూ, సుఖాలూ - దేనినీ ఒదులుకోకుండానే సంపద పెంచుకుంటున్నారు. ఆయన వద్ద డబ్బు బానిసగా పడి ఉంది. కానీ తన వద్ద డబ్బు యజమానిలా రెచ్చిపోతూ తననే బానిసగా చేసుకుంది!

వాళ్లిద్దరూ ఎవరి ఆలోచనల్లో వారు ఎంతసేపు ఉండిపోయారో!

''సార్!'' అన్న కేకతో ఉలిక్కిపడి గుమ్మం వద్దకెళ్లాడు మోమూ.

''సార్! ఫుల్‌గా తప్పతాగి అర్ధరాత్రి సమయంలో కన్నూమిన్నూ కానని వేగంతో బైక్ మీద పోతున్న ఇద్దరు యువకులు పెద్దాపురం సమీపంలో చెట్టుని గుద్దుకున్నారు. బాగా దెబ్బలు తగిలాయి. ఒకబ్బాయి ఫార్మసి చదువుతున్న సందీప్ అని తెలిసింది. రెండోవాడు మీ అబ్బాయి అయి ఉంటాడని మా అనుమానం. ఒకసారి పెద్దాపురం పోలీసుస్టేషన్‌కు రండి'' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

వింటూనే కెవ్వున అరిచి కుప్పకూలిపోయింది ప్రియ. మోమూ గుండె లవిసిపోయి కన్నీళ్లు జలపాతాలయాయి.

''నో! మా అబ్బాయి అలాంటివాడు కాదు. వాడు నా కొడుకు!'' అనబోయాడుగాని ఎవరో గొంతు నొక్కేసినట్లు మాట బయటకు రాలేదు.

యజమానిగా మారిన బానిస వికటాట్టహాసం చేస్తున్న ధ్వని తీతువుపిట్ట కూతలాగా ఎక్కడ నుంచో వినిపిస్తోంది!

☆

## ఇదండీ ప్రోత్సాహమంటే...

**ఈమధ్య బికినీల్లో కనిపించడానికి చాలామంది తారలు తెగ ఉబలాటపడిపోతున్నారు. ఆ లిస్టులోకి సోహా అలీ ఖాన్ కూడా చేరుతోంది. ఇమ్రాన్ హాష్మి హీరోగా నటించే ఓ సినిమాలో ఆమె ఇలాంటి గెటప్‌లో కనిపించడానికి రెడీ అవుతోందిట. ఇటీవల ఓ మ్యాగజైన్ కోసం ఎక్స్‌పోజింగ్ టైప్ గెటప్పుల్లో ఫోటోలకి పోజులిచ్చిన సోహా తీరుకు స్వయానా ఆమె తల్లి షర్మిలా బోల్డు ఇదైపోయిందిట. అంటే మరేం లేదు- తన కూతురి ధైర్యానికి ముచ్చటపడిపోయి కూతుర్ని తెగ మెచ్చేసుకుందిట. దీంతో సోహాకి ఇంకా ధైర్యం వచ్చినట్టుంది కాబోలు ఇప్పుడు బికినీలో కూడా ట్రై చేస్తున్నట్టుంది. ప్చ్!**

